సోమిరెడ్డి జమున

ఎర్ర సుక్కల సిలుకు సీర

చీపుర తీసుకుని దొడ్డంతా వూడ్చి వీధి వాకిట్లో నీళ్ళు చల్లి రోజూ కంటే వుషారుగా పెద్ద ముగ్గేసి అంట్లన్నీ తళ తళ లాడేట్టు తోమి వంటింట్లో బోర్లించి, మొజాయిక్ నేలంతా శుభ్రంగా తుడిచి బట్టలన్నీ వకచక ఉతికేసిన రంగి వైపు చూసి.

"ఏమే రంగి యీరోజు భలే ఉషారుగా వున్నావే ఏమిటి సంగతి?" అని పలకరించాడు వంటయ్యరు.

"ఎప్పటి నుండో కొనాలను కుంటున్నా నయ్యరూ నాకూతురికి సీర యియ్యాల్టికి అమ్మగారిచ్చే జీతపు డబ్బులతో నా కోరిక తీరతది".

"నీ కూతురుకు నీ అల్లుడు కొంటాడు గానీ ఆ డబ్బులతో నువ్వు కొనుక్కో నరిశిగాడు సంతోషిస్తాడు".

"ఆడికి నేనెట్టా పోతే ఏం అయ్యరూ ఆడికి నాటు సారా బుడ్డి, కాటన్ మార్కెట్టు వుంటే సాలు" అంత ఉషారులోనూ మొగుడ్ని తల్చుకుని ఉసూరుమంది.

అమ్మగారిచ్చిన జీతపు డబ్బుల్లో అలవాటు ప్రకారం పది రూపాయలు పాత ట్రంకు పెట్టిలో మల్లి చీరకోసం దాచిన డబ్బుల్లో కలుపుదామని చూసే సరికి రంగి ప్రాణాలు పైనే పోయాయి.

"ఓలమ్మో! నా డబ్బులు కొట్టేసార్రోయ్ పాడుదవ్వ సచ్చినోళ్ళు"– అని రాగాలు తీస్తూ గుండె బాదుకో సాగింది.

"ఏమయిందే రంగి"

"అయ్యో! అత్తా! నా కూతురు కడుపుతో వున్నపుడయినా దాని కోరిక తీరుత్తామని పయిసా పయిసా కూడట్టు కున్నాన్రోయ్. దాని లగ్గానికి ఎర్ర సుక్కల సిలుకు సిర తీసియ్యమని అడిగితే అంత డబ్బు ఒక్క సీరకే ఖరుసు సేసేస్తే మెట్టిలు, గొలుసులు, పుస్తెలు బత్తాదు ఒడ్డగింజలు ఎట్టా వత్తాయని ఇంకెప్పుడైనా తీసిస్తానని నా మల్లికి సెప్తిని గదరా. ఇప్పుడు సెమటోడ్చి దాసుకున్న కాసులన్నీ ఎవరో దొబ్బేసేర్రోయ్".

"నర్సిగాడు రిచ్చా ఏత్తున్నాడు గదే కొనిత్తాడులే లెగు" చుట్టూ చేరిన గుంపులో నుండి ఓ కంఠం ఓదార్చింది.

"ఆడి జిమ్మడ ఆడికి సారాబుడ్డి, కాటన్ మార్కెట్టు వుంటే పెళ్ళాం బిడ్డలు గురుతుకొత్తారా?"

"ఏందేహే నేను సచ్చినట్టు శోకాలెడుతున్నావ్?" నర్సిగాడ్ని చూసి అందరూ వెళ్ళి పోయారు.

చేతిలో నాటు సారాబుడ్డి, కోడి,సంచిలో బియ్యం చూడగానే ఆ డబ్బులు నర్సిగాడి చేతిలో పడ్డాయని అర్థమయింది రంగికి.

"....ఓరి సచ్చినోడా కన్న కూతురు నీళ్ళోసు కుందనయినా లేకుండా దానికి సిర కొనాలని సెమటోడిసి కూడబెట్టిన డబ్బులతో సారాబుడ్డి, కోడి కొంటావా?"

"లెగేహేఁ కోడి కూరొండు. మల్లికి ఒక్క సిరేం కరమ అరడజను సిరలు కొంటా. కాటన్ మార్కెట్టులో డబ్బు రావాలే గాని" సారాబుడ్డి పూర్తి చేసి వెళ్ళి పోయాడు వాడు. కాటన్ మార్కెట్టు కట్టి ఎన్ని సుఖాలు తనకిస్తానన్నాడో!

సిరుగుల పాత్తిళ్ళలో పడుకో నున్న కూతురుని చూసి మురుసుకుంది రంగి. మల్లి అని పేరు పెట్టుకుంది.

"నీ కూతురు నీ పెళ్ళాం లాగ పాసిపని చేసి బతక్కూడదు మావా. మారాజు బిడ్డల్లాగ బళ్ళో కెల్లి సదువుకోవాల– ఇప్పటి నుండి పైసలు దాయి మావా".

"అంతా పిచ్చి భమే రంగి నీకు. ఇప్పట్నుంచి కూడట్టాలా? ఒక్కసారి కాటన్ తగిలిందంటే నా తల్లిని బంగారంలో ముంచనూ!"

అనుభవం తక్కువ అయిన రంగి తన మావ మాటలకు పొంగి పోయింది. మల్లికి ఏడేళ్ళు వచ్చే సరికి రంగికి తన మావ మీద పెట్టుకున్న ఆశల పొంగంతా చల్లారిపోయింది. వాడు రిక్షా లాగి సంపాయించిన డబ్బంతా వాడు తాగే నాటు సారాబుడ్లకు, వాడు మరిగిన కాటన్ మార్కెట్టుకూ సరిపోయేది. రంగి తను పనిచేసే ఇంట్లో నుండి తెచ్చిన అన్నం మెతుకుల్లో మల్లికి, నర్సిగాడికి

భాగం పెట్టేది.

చిరుగుల చీర బొడ్లో దోపుకుని చమురు లేక ఎండ పోయిన తలను గోళ్లతో సరి చేసుకుని కొప్పెట్టుకుని పాచి పనికి బయలు దేరే రంగిని మల్లి ఆటకాయించింది.

"అమ్మోయ్, అమ్మోయ్! నాకు ఎర్ర సుక్కల సిలుకు గౌను కొనిత్తా నంటివే ." కళ్లు నులుముకుంటూ కాళ్ళు కద్దం పడింది మల్లి.

"అట్టాగే లేయే మల్లి. నీకు సొక్కా కొనిచ్చి బడలో ఎత్తాలేయే లేచిన. కూతుర్ని చంకనేసుకుని ముద్దు పెట్టుకుని దింప బోయింది.

"అహఁ నాను యీయాలే కొత్త గౌను తొడుక్కోవాల" ఏడేళ్ళ మల్లి హఠం వేసి చంక దిగలేదు. మల్లి ఎంపిరి జుట్టు పైకెగదోసి అక్కడే పడున్న పాత గుడ్డ పేలిక ఆ జుట్టుకు కట్టి పాచి పనికి కదిలింది.

అమ్మగారింట్లో ఎల్లిని చూడగానే రంగి చంకలో నుండి దిగి చెంగున దాని దగ్గరకు పరిగెట్టింది మల్లి.

పాచి పనంతా చేసి మల్లి నెత్తుకుని బావిచాటుకు తీసుకెళ్ళి చద్దన్నం గిన్నె ముందు పెట్టింది రంగి.

"నా కొద్దుపో యీయాల నాకు గౌను కొనిత్తానంటివే"

"అట్టాగే లేయే యీయాల అమ్మగారింట్లో ఇందంట మద్దేన్నం మంచి కూరలేసి కూడెట్టాగాని ఎల్లి ఆడుకో!"

"రంగీ! ఎక్కడ చచ్చావే యిక్కడ పని తెమలక నేను ఛస్తుంటే తీరిగ్గా కూతురుతో ముచ్చట్లాడు తున్నావా?"

అమ్మగారి అరుపుకు కాళ్ళకు చుట్టుకుని ఏడుస్తున్న ఏడేళ్ళ మల్లిని విదిలించుకుని లోపలికి పరిగెట్టింది రంగి.

పనంతాపూర్తి చేసుకుని బావిలో నీళ్ళు చేది ముఖం కడుక్కుంటున్న రంగికి బావి ప్రక్కనే ఎర్రటి ఎండలో గచ్చు మీద ఏడ్చి, ఏడ్చి నిద్రపోయిన కూతుర్ని చూసి కడుపులో దేవింది. ప్రక్కనే తను కూడా తినకుండా కూతురుకు పెట్టిన చద్దన్నాన్ని కోళ్ళు చెల్లా చెదరుగా చేసేసెయి.

* * * *

అమ్మగారిచ్చిన మిగిలిన కూరలు అన్నం అందుకుంటూ భయంగా అడిగింది రంగి.

"యీయాల మల్లి ఆటం ఏసిందమ్మగారో! ఆ కుర్రదానికి ఎర్ర సుక్కల సిలుకు సొక్కా మీద మోజు పోనాది. వచ్చే నెల డబ్బులు కూడా యిత్తే దానికి కొనెద్దానమ్మా."

ఆవిడ కాదనకుండా రెండు నెలల జీతం రంగి చేతిలో పెట్టింది. రంగి ఆనందాని కంతు లేదు. మల్లిని లేపుకుని తన గుడిసెలోకి తీసుకెళ్ళి దానికి తను కొనబోయే సొక్కా గురించి. ఆశలూరిస్తూ అన్నం పెట్టి గుడిసె పక్కగా వుండే చిన్న టింకాయ మట్టల దడిలో రాతి మీద కూచో బెట్టి కుంకుడుకాయ రసంతో తలకుపోసి, తన గోళ్ళతో మల్లి ఒళ్ళంతా అలుముకున్న మట్టి రుద్ది, నీళ్ళు పోసి, ఆరబెట్టిన జుత్తుకు చిక్కుతీసి అదే పాత గుడ్డ జడకు గట్టి, డబ్బులు మిగిలితే ఒక రిబ్బను ముక్క కూడా కొనాలని అనుకుంటూ మల్లిని చంక నేసుకుంది రంగి.

"నువ్వు బువ్వ తినవా?" తల్లి నడిగింది మల్లి.

"ఈ సంబరంలో మరిసే పోయానే దిగు." అంటూ తను తిని నర్సిగాడికి నాలుగు పిడసలు చీమలు తినకుండా చెక్కపెట్లో పెట్టి గుడిసెకు చిక్కేసింది. గౌను కొనడానికి అమ్మ, కూతురు బయలు దేరారు.

నాలుగడుగులు నడచేసరికి ఎదురుగా రొప్పుకుంటూ వెనకింటి వెంకటేశు పక్కింటి కిష్టడు వచ్చి—

"నరిశి మావను ఆసుపత్రిలో ఏసారు లగెత్తు!" అని చెప్పారు.

"ఓ యయ్యోయ్! నా మావకేమయింది రోయ్!" శోకాలు తీస్తూ అడిగింది రంగి.

"నాటు సారాలో కలితి ఏదో సేసారంట. పడిపోనాడు. మేమూ వత్తాం పద."

మల్లిని సంక నేసుకుని పరుగులాంటి నడకతో హాస్పిటల్‌కు చేరింది. అప్పటికే నర్సింహులికి పొట్టంతా శుభ్రం చేసారు.

సెలైన్ సీసాలకు, మందులకు రంగి బొడ్లో డబ్బులు మాయమయి పోయాయి.

మావకని ఎత్తిపెట్టిన అన్నం, కూర మల్లికి పెట్టి బాగా సంపాయిస్తున్నా— ఆ డబ్బంతా దుర్వ్యసనాలకు కాజేస్తున్న మొగుడ్ని తల్చుకుని దాని ఖర్మకు దాన్నే నిందించుకుంటూ పడుకుంది ఆ రాత్రి పుత్తకడుపుతో రంగి.

* * * *

ప్రొద్దున్నే లేచి నీరసంగా పనిలో కెళ్ళింది. రాత్రి గంజి కూడా లేక కడుపులో ప్రేగులు అలల్లాడి పోయే బాధ కంటే మల్లికి గౌను కొనలేక పోయానే అనే బాధ దాని కెక్కువగా వుంది. అమ్మగారిచ్చిన చద్దన్నం తినాలని ముద్ద నోట్లో పెట్టుకోబోతుంటే గుడిసెలో కాళ్ళు డొక్కలో పెట్టుకుని పడుకోనున్న నర్సిగాడు గుర్తు కొచ్చాడు. వాడు చేసిన పాడు పనికి కోపంగా వున్నా కట్టుకున్న పాపానికి ఆ అన్నం తను తినకుండా గుడిసెలోకి తీసుకెళ్ళి వాడి ముందు పెట్టి—

"మావా! ఆ సారాలో ఏం రుచుంది సెప్పు. పోని పాణానికి సుఖమన్నా వుందా? ఆ సారా తాగబట్టి కదా నిన్ను ఆసుపత్రిలో ఏసారు. మల్లికి సొక్కాకని అమ్మగోర్నడిగి రెండు నెలల కట్టం ముందుగానే తీసుకున్నాను. అదుండబట్టి, నీ మందులకు. సరిపోనాది లేకుంటే అప్పటికప్పుడు మన కెవడిత్తారు సెప్పు మావా! ఆ పాడలవాట్లు మానేత్తే మల్లికి ఎన్ని సొక్కాలయినా కొనుక్కోమా? దాన్ని బళ్ళో ఏసి చదివించుకోమా? ఆ సారా తాగబట్టే కదా నిన్న పాణం మీదకు తెచ్చుకున్నావు? నువ్వు రిచ్చా లాగి సంపాయించే డబ్బుతో, నేను అమ్మగోరి దగ్గర తెచ్చుకునే పైసలతో ఎంత సుకంగా వుండొచ్చు ఆ పాడు సారా ఇంకయినా మానేయ్ మావా?" మంచిగా చెప్పుకుంది.

"నిన్నూ మల్లిని సుఖపెట్టాలని గదే కాటన్ ఆడేది— కాటన్ ఆడాలంటే మెదడు బాగా పని సేయాలే. దానికి సుక్క పడందే లాబంలేదే రంగీ"

అతడు చెప్పినా వినడని తెలుసుకున్న రంగి—

"సర్లే మావా? ఈ గంజి నీవూ మల్లి తాగేయండి. అమ్మగోర్నడిగి నేను ఏదైనా పెట్టించుకుని తింటాలే— నేనొత్తా ఎక్కడి పని అక్కడే వుంది."

"ఎదవ గంజి ఎవడిక్కావాలే రంగి. నీకాడ డబ్బులుంటే యియ్యే. నా గొంతు తడుపుకోకుంటే లాబం లేదే!"

"నాకాడేదుంది మావా! పిల్లదానికి కొనాలనుకున్న సొక్కా డబ్బులంతా నిన్న నీ మందులకే కరుసయి పోనాది కదా!" అని గుడిసె దాటబోయింది.

డబ్బుండి ఇవ్వనంటోందని కోపంతో రంగి జుట్టు పట్టుకుని వంచి వీపు మీద నాలుగు గుద్దులు గుద్దాడు.

"అమ్మను కొట్టగాకయ్యా!" అప్పుడే నిద్రలేచిన మల్లి నర్సిగాడి చేతులు పట్టుకుంది.

దాన్ని విదిలించి కొట్టి విసురుగా గుడిసెవతలకి వెళ్ళబోతున్న నర్సిగాడి కాళ్ళకు చద్దన్నం గిన్నె తగిలి వీధిలోకి పోయి బోర్లపడి పోయింది.

నీరసంగా వున్న రంగి ఆ గుద్దులతో కూలబడి పోయింది.

"నాకు గౌను ఒద్దే! ఆ డబ్బులు అయ్యకిచ్చెయి.

అమ్మ కేమవుతుందో అనే భయంతో ఏడ్చేసింది మల్లి. ఆ పసి మనసుకు ఏమనిపించిందో అప్పటి నుండి ఎర్ర సుక్కల గౌను కావాలని గానీ, ఎర్ర సుక్కల పరికిణీ కావాలని గానీ వాళ్ళమ్మను అడగలేదు. పెళ్ళికి మాత్రం డబ్బులుంటే ఎర్ర సుక్కల సిలుకు సీర కొనిమ్మా అని అడిగింది.

"ఏంటే రంగి అలా కూకొండిపోయావ్. కోడికూర వండలా!" నర్సిగాడి కోపం తెలిసిన రంగి గతం నుండి తేరుకుని లేచి కూరొండి వాడికి పెట్టింది.

"ఏది ఎట్టయినా మల్లికి పురుడయ్యేలోపల సీర కొనాలని" నిర్ణయించుకుంది.

"మల్లికి పురుటి రోజులు వస్తున్నాయి మావా ఖర్మారపు పండు పట్టుకెళ్ళి దాన్ని పురుడుకు తీసుకొత్తానయ్యా!"

"నీ దగ్గరుండే డబ్బు లిట్టియ్యే ఆ డబ్బులకు కాటన్ కట్టి మల్లికి పాల సీట్లు సేయించి యిట్టిడు పట్టుకెళ్దాం."

"ఆ మాట విని, విని విసిగిపోయిన రంగి ఆ పూసెత్తితే తన దగ్గర మరోలా దాచుకున్న డబ్బులు లాగేస్తాడని నిద్ర నటించింది.

"పొద్దుద్రపుగొట్టు మొహం పడుకుంటే నిద్రో తది" అనుకుంటూ వాడూ నిద్రలోకి జారిపోయాడు.

* * * * * * * *

తన గుడిసెలో దాచుకుంటే నర్సిగాడు తీసేసుకుంటాడని తను పనిచేసే అమ్మగారి దగ్గర

మూడు నెలలనుంచి పైసా పైసా చేర్చుకున్న డబ్బులు అడిగి తీసుకుంది. రెండు రూపాయలకు కర్జూరపు పండు కొని మూట కట్టుకుంది. పిల్లదానికి పురి టీకి తీసుకురాడానికి ఎల్తున్నానమ్మా ఓ పాత సీరుంటే పడేయండమ్మా! అని అడిగితే ఇచ్చిన చిరిగిపోయిన.తెల్ల సిలుకు చీర మడతేసుకుంది.

కడుపులో ప్రేగులు అరుస్తున్నాయి. అయినా ఉషారుగా నడుస్తోంది. కూతురి కోరిక తీర్చబోతున్న సంతోషంలో నడుస్తోంది. రెండు కిలో మీటర్లు నడిచేసరికి రంగి వంట్లో ఓపిక నశించింది.

కడుపులో ఆకలి, ఒంట్లో నీరసం కలిసి రంగిని రోడ్డు ప్రక్కగా పోసే దోసెలమ్మి దగ్గరకు నడిపించాయి. దోసె పదిహేను పైసలు పల్చగా వున్నాయి.

"తన ఆకలి తీరాలంటే అరవై పైసలన్నా కరుసు సేయాల - ఆ డబ్బులే సీరకు తక్కువయితే అమ్మో! ఇంకేటయినా వుందా? ఎన్నో ఏళ్ళనుండి తన కూతురి కోరిక తీర్చలేకుంది. ఇప్పుడూ అట్టాగే తీర్చలేకపోతే ఇక వయసుమీరి పోతున్న తను కూడెట్టి కొనగలదా?

అలా మనసులో అనుకుని నడవ సాగింది.....

చెమటలు కారిపోతున్నాయి. కళ్ళు తిరిగిపోతున్నాయి. పొలాలమ్మట అడ్డ దారినబడి నడుస్తున్న రంగి కాళ్ళు ఇక నడవలేమని మొరాయించాయి. అక్కడే తుమ్మచెట్టు నీడన కూలబడిపోయింది. పెద్ద తుమ్మ ముల్లు కసుక్కున పాదంలో దిగబడింది. ముల్లు లాగేసరికి నెత్తురు బొటబొట కారింది.

రంగి మనసునిండా ఆవేదన. దానికి తన మొగుడు గుర్తొచ్చాడు. "అదే తన మొగుడు మంచోడయితే తన కూతురడిగిన ఒక్క కోరికకు తనింత కష్టపడాల్సి వచ్చేదా? ఇలా ఒంటరిగా నడచి యీ చేలలో యిలా కూలబడాల్సి వచ్చేదా? ఇద్దరూ కలిసి తన కూతురి దగ్గరకు రిచ్చాలో ఎల్లేవాల్లు కదా! రిచ్చాలాగి సంపాయించిన డబ్బంతా పాడలవాట్లకు ధారపోయకుంటే తమ బతుకులు ఎంత బాగుండేవి? తాగుబోతోళ్ళకంతా ఆ సత్తెం ఎందు కర్థంకాదో?"

రంగి కళ్ళు మత్తుగా కూరుకుపోతున్నాయి. అలసట ఆమె శరీరాన్ని ఆక్రమించుకుంటోంది. ఆమె మనసు మాత్రం ఇంకా పనిచేస్తూనే వుంది. ఆమె గుండెలు మండిపోతూనే వున్నాయి.

"అస్సలీ గవర్నమెంటోళ్ళకి బుద్ధి లేదు. ఎందుకొప్పుకోవాలంట సారా కాయడానికి?.... ఊహు..... ఈ కల్లుపాకలోళ్ళనంతా పొడిసేస్తే సరి మరిక కల్లుపాక లెట్టను మిగతోల్లు భయపడేట్టుగా!

ఇంకేంచేస్తే యీ తాగుబోతోళ్ళు యీ పెపంచంలో మిగలకుండా వుంటారో.... ఆలోచిస్తూనే వుంది. ఆలోచించి.... ఆలోచించి ఆమె మనసు అలసిపోయింది. అది నిద్రాదేవి చిలిపితనానికి లొంగిపోయింది.

రంగికి మెలకువ వచ్చేసరికి సూర్యుడు నడినెత్తిమీద కొచ్చేసాడు. తన బండతనానికి తిట్టుకుంటూ లేచింది. పాదం క్రింద మోపగానే జివ్వుమని లాగింది. కుంటుకుంటూ కొంతదూరం నడిచింది. పొలాలకు పారే నీళ్ళు కాలువలో విసురుగా పారుతున్నాయి.

చిన్నగా కాలువ దగ్గరకు నడిచి కాలువలోకి వంగి ముఖం కడుక్కుని దోసిట్లోకి నీళ్ళు తీసుకుని త్రాగింది. బొడ్లో పైటలాగి ముఖం తుడుచుకోబోయేంతలో డబ్బులు కట్ట జారి నీళ్ళలో పడిపోవడం - ఆ విసురుకు కొట్టుకుపోవడం కనురెప్పపాటులో జరిగిపోయింది.

"నా డబ్బులు - నా డబ్బులు" పెద్దగా కేకేసింది.

అక్కడే పొలాల్లో పని చేసుకుంటున్న మనుష్యులు రంగి అరుపులకు పరిగెత్తుకొచ్చారు.

"బాబ్బాబు నా బిడ్డకు సీర కొనాలని పోగెట్టిన డబ్బులు బొడ్లో దోపుకున్నాను బాబూ అయి మిడియాలుగా నీళ్ళలో జారిపోనాయి. దిగి నా డబ్బులు తెచ్చి పుణ్యం కట్టుకోండయ్యా!" పిచ్చిపట్టిన దానిలా అరుస్తోంది.

వచ్చిన మనుష్యులు నీళ్ళలోకి చూసారు. వాళ్ళ కెక్కడా ఆ పారే నీళ్ళలో డబ్బులు కట్ట కన్పించలేదు.

"భలేదానివమ్మో - ఏ బిడ్డో నీళ్ళలో మునిగిపోతే కేక లేస్తున్నావని పని వదిలిపెట్టి లగెత్తుకొచ్చాము. డబ్బులు కాగితాలు ఇంతసేపు ఇక్కడే వుంటాయా? ఎల్లెల్లు" వాళ్ళ పనిలోకి వాళ్ళెళ్ళిపోయారు.

ఆమెకు మనసునిండా దిగులు - కడుపున పుట్టిన బిడ్డ పోయినంత దిగులు. సర్వం కోల్పోయి బికారిలా మిగిలిపోయినంత నైరాశ్యం.

"ఎర్ర సీర" దాని కళ్ళ ముందు కన్పిస్తోంది. కడుపుతో వుండే కూతురుకాడికి 'సీర' కొని పట్టుకెళ్ళాలని తనెన్ని కలలు కంది. కడుపుకు సరిగ్గా తినకుండా దాచిన డబ్బులన్నీ దాని కళ్ళముందే నీళ్ళలో కొట్టుకుపోతే ఆమె గుండెలో మంటలు ఎగిసి పడుతున్నాయి.

"పాపిష్టిదాన్ని. మల్లికి నచ్చిన ఎర్ర సుక్కల సీర కొనుక్కుంటాదని ఆశపడకుండా తనే అలాటి సీర కొని పట్టుకొచ్చుంటే ఇలా.... ఇలా.... అయుండేది కాదుకదా! పోనీ కొద్ది దూరానికి పాలుమాలక రోడ్డంట నడిచుంటే యీ అవాంతరం జరిగేదికాదుకదా!" అనుకుంటూ గట్టున పెట్టిన ఖర్జూరపు పండు మూటను, పాత చీరను అందుకుని అక్కడే కూలబడి ఏడవ సాగింది.

"వుత్త సేతులతో మల్లికాడికి ఎల్లను-ఎల్లలేను" అనుకుని వెనక్కి నడిచింది.

నాలుగడుగు లేసేసరికి తల్లి పేగు కూతుర్ని చూడకుండా వెళ్ళిపోడానికి మనసొప్పలేదు. ఆ ఖర్జూరపు పండు మూటను గట్టిగా గుండెల కదుముకుని మరలా ముందుకు నడిచింది.

కడుపులో ఆకలి, ఒంట్లో నీరసం, గుండెల్లో దిగులు కలిసి ఆ మిట్ట మధ్యాహ్నం మల్లి గుడిసెకు చేరేసరికి రంగి నిస్త్రాణ అయిపోయింది.

మల్లి గుడిసె చుట్టూ జనం పోగయి వున్నారు.

రంగి అరిపోయిన పెదాలు విచ్చుకున్నాయి. పిడచ కట్టుక పోయిన నాలుక "నాకు మనవడో, మనవరాలో" అని సంబరంగా అంటోంది. నడవలేని కాళ్ళకు ఉత్సాహం వచ్చి గుడిసెలోకి అందర్ని తోసుకుని పరిగెత్తాయి.

"మల్లి అమ్మ వచ్చింది" గుస -గుసగా అంటున్నారు.

నెత్తురు ముద్దలాటి పసిబిడ్డను చూస్తాననుకున్న రంగికి తన కూతురు నెత్తురు మడుగులో నిర్జీవంగా పడుండడం చూసి బిత్తర పోయింది. సత్యం బోధపడ్డాక పెద్దగా ఏడుపు లంకించుకుని కూతురిమీద పడిపోయింది.

అయినా పెల్లి సేసిందేగాని ఒక్కనాడయినా వచ్చి కన్న బిడ్డను సూసిందా? సీర - సారె పెట్టకపోతే పోనాది. పుట్టింటికి తోడుకుపోకపోతే పోనాది నీళ్ళోసుకున్న పిల్ల బాగోగులన్నా కనుక్కుందా?"

"పోనీలెండి ఆఖరి సూపయినా దక్కింది. లేకుంటే ఈ కోపిష్టి ఈరిగాడు మల్లి అమ్మకు, అయ్యకు సెప్పి పంపేవాడేనా?"



ఈ వేమన పద్యాలు



కాంచనంబు పైన కాంతుల పైనను
బ్రహ్మకైన బుట్టు రిమ్మ తెగులు
తోయజాక్షి విడుచు దొర యెవ్వడును లేడు
విశ్వదాభిరామ వినురవేమ.

"వాడి కోపం తగలెయ్య. సిందు మాలాలయినా లేకుండా వాడడిగిన సుకం యీలేదని పొట్టమీద తంతాడా పాడుదరిద్రపు సచ్చినోడు."

"సక్కటి బిడ్డనుకనాల్సింది. కసాయోడి సేతిలో నెత్తురు మడుగులో సచ్చినాది. దాని రాతకొద్దీ దొరికాడు."

కూతురు మీదపడి భోరున ఏడుస్తున్న రంగి చెవుల్లో వాళ్ళందరి మాటలు పడ్డాయి. దాని గుండెలు మండిపోతున్నాయి. తన కూతురు చిరుగుల సీర పాత్తిళ్ళలో పడుకుని తనను అమ్మనుసేసి మొదటిసారిగా నవ్విన కూతురు "నాకు ఎర్ర సీర కొనివ్వవా?" అని ఆశగా అడిగిన కూతురు - అడిగి,

ఎర్ర సుక్కల సిలుకు సీర

అడిగి అలిసిపోయిన కూతురు-

"కడాకు మనువాడేటప్పుడయినా కొనియ్యవే" అని బతిమిలాడిన కూతురు-

"కొసాకు నువ్వు చచ్చాక కప్పడానికైనా ఎర్ర సుక్కల సీర తేలేకపోయానే మల్లి" బావురుమంది రంగి.

అంతవరకు పొర్లి పొర్లి ఏడుస్తున్న దానికంట్లో ఒక్క నీటిబొట్టు కూడా రాలేదు. ఇప్పుడు తన కూతురడిగిన చీర కొనివ్వలేని తన అసమర్థతకు గుండె ద్రవించి కన్నీరు చిలికింది.

ఎందుకని? ఎందుకని కొనివ్వలేకపోయింది. రెక్కలు ముక్కలు సేసుకుని గడిత్తున్నా ఎందుకు కొనలేకపోయింది? పోనీ దాని పెనిమిటయినా దాని కోరిక తీర్చలేదు ఎందుకని? ఆడి సంపాదనంతా తాగనే సరిపోయె!

అలా తన అల్లుణ్ణి తలుచుకోగానే బిడ్డ శవంమీద పడున్న రంగికి రిక్షామీద రోజుకు ఇరవై రూపాయిలు సంపాయించే మొగుడు గుర్తొచ్చాడు. వాడి కాటన్ మార్కెట్ గుర్తొచ్చింది. వాడి తాగుడు గుర్తొచ్చింది.

"ఏ ఎదవ ఆడివల్లో నా కూతురు సచ్చిపోనాది. సీ....సీ. ఆడితో సస్తే కాపురం సేస్తదా తను?" అంత బాధలోనూ మొగుణ్ని చీదరించుకుంది.

రంగి గుండెల్లో తాగుబోతు వాళ్ళంటే అసహ్యం. తన బిడ్డను చంపిన తాగుబోతోళ్ళంటే విరక్తి. ఆ విరక్తి మధ్యగా ఆ తాగుబోతు తండ్రి దగ్గర నుండి తాగుబోతు భర్త దగ్గర నుండి ఏమి పొందలేని చనిపోయిన తన కూతురుమీద పొంగిన విపరీతమైన జాలి, ప్రేమ ఆమెను కంటికి కడివెడుగా ఏడ్చేటట్లు చేసాయి.

"నీ కోసం ఖర్జూరపు పండు తెచ్చానే మల్లి - నీ యమ్మ సేతిది తినకూడదనుకున్నావా?" పెద్దగా ఏడుస్తున్న రంగి ఒక్క ఉదుటున లేచి తను తెచ్చిన తెల్లటి సిల్కు పాత చీర ఆ గుడిసెలో పరిచి ఆ చీరనిండా తన కూతురు చుట్టూ మడుగులా వున్న రక్తంతో చుక్కలు పెట్టసాగింది.

"ఏటిహెం కూతురు సావు సూసి ఆ తల్లికి పిచ్చిగాని పట్టిందా? కూతురు సచ్చిపడుంటే నెత్తురుతో సింకి సీరమీద సుక్క లెడుతుందేవిటి?" ఆ గుంపులో ఒక ముసలిది బుగ్గన వేలేసుకుని అంది.

"మల్లీ! నీకు ఎర్ర సుక్కల సిలుకు సీర తెచ్చానే ఇంద ఇదిగో నే మల్లి" ఏడుస్తున్న రంగిని గుడిసెలో వాళ్ళంతా పట్టుకుని-

"లే! దయిరం తెచ్చుకో. నీ కూతురు ఆయుసు ఇంతే ననుకో!"

కూతురు శవంమీద నుండి లాగి ఓదార్చాలని ప్రయత్నిస్తున్నారు. ఏడ్చి ఏడ్చి అలసిపోయిన రంగి తన కూతురు శవాన్ని కాటికి తీసుకెళ్ళడాని కొచ్చిన జనాన్ని సూసి అరిచింది.

"వొద్దు. వొద్దు. నా బిడ్డను అట్టుకెళ్ళొద్దు" వాళ్ళు రంగిని ప్రక్కకు లాగి మల్లిని ఎత్తుకున్నారు. మల్లిమీద రక్తపు చుక్కల తెల్ల చీర.

"తల్లీ! నా మల్లే, ఎర్ర సుక్కల సిలుకు చీర నిన్ను సంపేసిందే. అది తెచ్చి నిన్ను పుట్టింటికి తోలుకెళ్దామని ఆలీసం చేసానే కూతురా! లేకపోతే బేగొచ్చి నిన్ను తోలుకెళ్ళుంటే నీకి సావు రాదు కదే!" ఆ తల్లి కడుపు శోకం చూసి చుట్టూవున్న వాళ్ళ కళ్ళల్లో కూడా నీళ్ళు నిలిచాయి.

ఎర్రచుక్కల చీర నేనేం చేసానన్నట్టు జాలిగా చూసింది. తాగుబోతు నిషా అల్లుడు తూలుతున్నాడు. భార్య శవంమీద చీర అమ్ముకుంటే ఓ బుడ్డికైనా సరిపోద్దా? అని ఆలోచిస్తున్నాడు. □